

యశోద ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ప్రారంభించిన గవర్నర్

కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ జబ్బులపై ప్రజలకే కాదు.. ప్రాక్టిషనర్స్‌కు సమగ్ర అవగాహన ఉండాలని, కిడ్నీ సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో అత్యాధునిక క్రిటికల్ కేర్ నెఫ్రాలజీపై అంతర్జాతీయ సదస్సును ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంకా చాలామందికి కిడ్నీ జబ్బులపై సరైన అవగాహన లేదన్నారు. అక్యుట్ కిడ్నీ ఇంజరీస్, క్రానిక్ రీనల్ కిడ్నీ ఫెయిలర్ గురించి చాలా మందికి తెలియదన్నారు. వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. యశోద ఆస్పత్రుల డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రజల్లో మూత్రపిండాల వ్యాధులపైన, మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి శిక్షణ ఇచ్చేందుకు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన వైద్య నిపుణులు ఈ సదస్సులో పాలుపంచుకోటానికి ఉత్సాహంగా ముందుకు రావటం హర్షణీయమన్నారు. కిడ్నీ వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునేలా మూడు రోజులు అంతర్జాతీయ సదస్సును రుపొందించినట్లు నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర చక్రవర్తి వివరించారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న వెంకయ్య నాయుడు

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

నార్సింగ్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశం త్వరలో మూడో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం మణికొండలో గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1972-74 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ - సకుటుంబ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 50సంవత్సరాలు క్రితం ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు స్వర్ణోత్సవాలు చేసుకోవడం చాలా సంతోషకరమని అన్నారు. నేడు మన తెలుగు కుటుంబాల్లో తెలుగు తక్కువగా మాట్లాడుతున్నారని, మన భాషను మనమే కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అప్పట్లో చదువుచెప్పిన ఉపాధ్యాయులు సాంబశివరావు, విష్ణుప్రసాద్, వెంకటనారాయణ, కృష్ణంరాజు, సుబ్బయ్యను పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మనవలు, మనవరాళ్ళు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వెంకయ్య నాయుడికి ఆకృతి సన్మానం

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన నేపథ్యంలో శనివారం ఆకృతి సంస్థ సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. వెంకయ్యనాయుడికి అవార్డు లభించడం తెలుగు ప్రజందరికీ అందిన గొప్ప గౌరవం అన్నారు. వెంకయ్యనాయుడుకి సాహిత్యం, కళలు, కళాకారుల పట్ల ప్రత్యేక గౌరవం ఉందని తెలిపారు. వాసవి క్లబ్ స్థాపక అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వెంకయ్య నాయుడుకు పద్మ విభూషణ్ ప్రకటించిన సందర్భంగా యావత్ తెలుగు ప్రజలందరు పులకించి పోయారన్నారు. కార్యక్రమంలో ఆకృతి సహ కార్యదర్శి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నాలుగు వేల పడకల ఆస్పత్రిగా నిమ్స్

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ నాలుగు వేల పడకల ఆస్పత్రిగా త్వరలో అభివృద్ధి చెందనున్నదని సంస్థ సంచాలకులు నిమ్స్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నగరి బీరప్ప పేర్కొన్నారు. నిజాం వైద్య విజ్ఞాన సంస్థ, వైద్య విద్య అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్ముందు వైద్య అనుబంధ వృత్తివిజ్ఞాన కోర్సులు పీజీ స్థాయిలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అత్యంత అధునాతన వైద్య పరికరాలు.. అనుభవజ్ఞులైన అధ్యాపకుల నేతృత్వంలో ప్రపంచ స్థాయి అత్యుత్తమ నాణ్యమైన వైద్య విద్యకి నిమ్స్ పెట్టింది పేరని, ఇక్కడ సీటు రావడం విద్యార్థుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణులు మోటివేటర్ ఆనంద్ సిరిప్రగడ, వైద్యులు గంగాధర్ పాల్గొన్నారు.

ప్రొ. కోదండరామ్‌కు సత్కారం



తెలంగాణ ఏర్పాటుకు ముఖ్య భూమిక పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్సీగా ప్రకటించడంతో కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు శనివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, అశోక్‌ముదిరాజ్, సంతోష్‌కుమార్ తదితర నాయకులు కోదండరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

- ఫతేనగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- జాతీయజెండా అవనతం చేస్తుండగా...



రాజాబిక్ష ఫైల్

పేట్‌బషీరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జాతీయ జెండా ఇనుపరాడ్‌ను బయటకు తీస్తుండగా.. ఆ రాడ్‌కి ప్రమాదవశాత్తు పైనున్న విద్యుత్ వైర్లుతగిలి షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన రాజాబిక్ష(36) కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్ జిల్లా దేవరయాంజల్ గ్రామంలోని తిరుమల వెంచర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా ఉన్న పాలీకెమ్ పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గణతంత్ర వేడుకల సందర్భంగా శుక్రవారం తిరుమల వెంచర్‌లో కాలనీవాసులతో కలసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సాయంత్రం జెండాను అవనతం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కొంపల్లిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదుమేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 10వేల జరిమానా

- మూడు రోజులు ట్రాఫిక్ డ్యూటీ

పేట్‌బషీరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో చెన్నైకి చెందిన ఓ డ్రైవర్‌కు అత్వెల్లి 7వ స్పెషల్ కోర్టు మెజిస్ట్రేట్ పి.అరుణ 10వేల జరిమానా, మూడు రోజుల ట్రాఫిక్ డ్యూటీని శిక్షగా విధించారు. చెన్నైకి చెందిన వారిష్(27) మద్యం తాగి వాహనం నడుపుతుండగా అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి కోర్టు హాజరు పర్చగా మెజిస్ట్రేట్ శిక్ష విధించారు.

వివాహిత ఆత్మహత్య

హైదర్‌నగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్‌నగర్‌లో శ్రీనివాసరాజు భార్య మాధురి అనంతలక్ష్మి నాగదేవి(29)తో కలిసి నివాసముంటున్నారు. వీరికి నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. నాగదేవి కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతోంది. గురువారం మధ్యాహ్నం భర్త ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఆత్మహత్యను చూసి బాలుడు ఎదుటివారి దగ్గరకు వెళ్లి చెప్పడంతో వారు వచ్చి భర్తకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎప్పటికి పూర్తి చేస్తారో!



బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో కొనసాగుతున్న ఫ్లైఓవర్ పనులు

- బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో నత్తనడకన ఫ్లైఓవర్, రోడ్డు పనులు
- నిత్యం ట్రాఫిక్ సమస్య
- 15 నిమిషాల ప్రయాణం గంటల తరబడి రోడ్లపైనే..

మియాపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌ను నియంత్రించడానికి బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో చేపడుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల జాప్యం కారణంగా వాహనదారులు ఆరునెలల నుంచి నరకయాతన పడుతున్నారు. వేగవంతంగా చేపట్టాల్సిన పనులు నత్తనడక సాగడంతో బీహెచ్‌ఈఎల్ నాలుగువైపులా వెళ్లే వాహనదారులు గంటల తరబడి చౌరస్తాలో కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంవల్ల కేవలం 15 నిమిషాల ప్రయాణానికి గంటకు పైగా వేచివుండాల్సివస్తోంది. ప్రధానంగా చందానగర్ బస్టాప్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు, బీహెచ్‌ఈఎల్ చౌరస్తా నుంచి -పటాన్‌చెరు, లింగంపల్లి-హైటెక్‌సిటీ గచ్చిబౌలికి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, పటాన్‌చెరు పారిశ్రామిక వాడతో ఈ ప్రాంతంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఓ పక్క ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, అత్యవసర పనులమీద వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీహెచ్‌ఈఎల్ చౌరస్తాలో కల్వర్టు, రోడ్డు విస్తర్ణ, ఫ్లైఓవర్ పనులతో ఈ రోడ్డంతా తవ్వేశారు. ప్రత్యామ్నాయంగా వాహనాల రాకపోకలకు వేసిన రోడ్లు తవ్వివేసిన మట్టికుప్పలు, కంకరాళ్ళ అడ్డదిడ్డంగా వేయడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాంతంలో పని జరుగుతున్నట్టు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించే వారు. ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రాంతంలో చేపడుతున్న ఫ్లైఓవర్, రోడ్డు విస్తర్ణ, కల్వర్టు పనులు వేగవంతంగా పూర్తిచేయాలని స్థానికులు, వాహన దారులు కోరుతున్నారు.



నిలిచిన వాహనాలు





రోడ్డుపై పోసిన రాళ్లు, మట్టి కుప్పలు

ప్రజలకు రుణపడి ఉంటా..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లో శనివారం హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చేపట్టిన కృతజ్ఞతా యాత్ర ప్రగతినగర్ 25వ డివిజన్‌లో ముమ్మరంగా కొనసాగింది. ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆల్విన్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎన్టీఆర్ పార్కువద్ద నిర్వహించిన సమావేశంలో వివేకానంద్ మాట్లాడుతూ మొన్న జరిగిన ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా 85 వేల 576 ఓట్ల మెజారిటీతో తనకు అఖండ విజయాన్ని అందించిన మీ అందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. 14వ రోజు కృతజ్ఞతా యాత్రలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్, యువ నాయకులు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆల్విన్ మాజీ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, సంక్షేమసంఘ సభ్యులు పాల్గొన్నారు.

జీవో 55ను వెనక్కి తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జీడిమెట్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవోనెంబర్ 55ను వెంటనే వెనక్కి తీసుకుని, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను కాపాడాలని మేడ్చల్ జిల్లా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కన్వీనర్ నగేష్ డిమాండ్ చేశారు. శనివారం చింతల్ ప్రాంతంలో జీవో 55కు వ్యతిరేకంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీ భూములను కాపాడి, అదనంగా యూనివర్సిటీకి వెయ్యి ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. జాతీయ బాలికల దినోత్సవం రోజున ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై పోలీసులు చేసిన దాడిని ఖండించారు. దాడికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మృత్యుంజయ, చింతల నగర కార్యదర్శి జగదీష్, నగర సంయుక్త కార్యదర్శి గౌతమ్, సాయి పాల్గొన్నారు.

డ్రైవింగ్‌ను సామాజిక బాధ్యతగా గుర్తించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పేట్‌బషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్‌ను వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలని రవాణాశాఖ అధికారి కిషన్ అన్నారు. జీడిమెట్లలోని పేట్‌బషీరాబాద్, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో రోడ్డు భద్రతపై వివిధ పనులపై వచ్చిన వినియోగదారులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వరాదని, వాహనదారులు వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్స్ ఎస్‌వీఎన్. ప్రతాప్‌రాజు, రవికుమార్, మహేష్, త్రివేణిబాయి పాల్గొన్నారు.

'ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి'

పేట్‌బషీరాబాద్: జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం అల్వాల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి విద్యార్థులకు ట్రాఫిక్‌పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధాన రహదారుల్లో సిగ్నల్స్ వద్ద పాదాచారులు రోడ్డు దాటేటప్పుడు గ్రీన్ లైట్స్ ఉంటేనే దాటాలని, రెడ్‌లైట్ వస్తే నిదానం పాటించాలన్నారు. రోడ్డుపై నడిచేటపుడు వాహనాలకు ఎదురుగా నడవరాదని, తల్లిదండ్రులు వాహనాలపై ప్రయాణించేటపుడు తప్పని సరిగా హెల్మెంట్ ధరించేలా విద్యార్థులు చూడాలన్నారు. రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలను స్క్రీన్‌పై విద్యార్థులకు చూపించారు. అల్వాల్ సీఐ నాగేశ్వరావు, ఎస్ఐలు ప్రశాంత్‌రెడ్డి, శ్యాంబాబు, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బల్దియా.. ఇదేందయ్యా!

(3వ పేజీ తరువాయి)

రూ. 388 నుంచి రూ. 435 వరకు(సర్కిళ్లను బట్టి) చెల్లిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. 2022లో మరో ఏజెన్సీతో చేసుకున్న అగ్రిమెంట్ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రవాణా చార్జీల చెల్లింపు ఒకే విధంగా ఉన్నా.. ప్రాసెసింగ్ రుసుము మాత్రం యేడాది మాత్రమే చెల్లిస్తామని ఒప్పందంలో పేర్కొన్నారు. వ్యర్థాల నిర్వహణలో భాగంగా తయారు చేసే ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు, ఇతరత్రా ఉత్పత్తులు విక్రయించి ఆదాయం పొందాలని సూచించారు. ఒకే రకమైన పనికి ఒక్కో ఏజెన్సీతో ఒక్కోలా అగ్రిమెంట్లు కుదుర్చుకోవడంపై గతంలోనే తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే గత కమిషనర్ సదరు సంస్థకు చెల్లింపులు నిలిపేయాలని, మరో ఏజెన్సీ తరహాలోనే ఒప్పందంలో మార్పులు చేసే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. దీంతో కొన్నాళ్లపాటు బిల్లులకు సంబంధించిన ఫైళ్లను అధికారులు పక్కన పెట్టారు. కమిషనర్ బదిలీపై వెళ్లిన అనంతరం తిరిగి చెల్లింపులు మొదలయ్యాయి. రెండు ఒప్పందాలను పరిశీలిస్తే ఓ సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే ఉద్దేశం స్పష్టంగా తెలుస్తోందని పౌర సంస్థ ప్రతినిధి ఒకరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సదరు సంస్థకు రూ.60 కోట్లు చెల్లించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మరో రూ. 10-15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఆ సంస్థకు బిల్లులివ్వొద్దని గత కమిషనర్ చెప్పిన అనంతరమూ చెల్లింపులు జరగడం గమనార్హం. ఇంకో విషయం ఏమిటంటే.. 95 శాతం వ్యర్థాలకు అన్‌క్లెయిమ్డ్(ఎవరివో తెలియని) కేటగిరీలో బిల్లులు చెల్లిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

రోడ్డు సమస్య పరిష్కారానికి కృషి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మసీద్‌బండలోని మారుతినగర్ కాలనీలో ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్ పక్కన ఉన్న రోడ్డు సమస్యను శనివారం ఎమ్మెల్యే గాంధీ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా రోడ్డును వదిలి ప్రహరీ నిర్మించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏసీపీ మెహ్రా, టీపీఎస్‌లు రవీందర్, రమేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్రీడాకారులకు సూచించారు. బాలానగర్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌లో రాజీవ్‌గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులకు కరచాలనం చేసి వారికి ఆల్‌దిబెస్ట్ చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏడాది రాజీవ్‌గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది క్రికెట్‌పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అజీజ్, ప్రధానకార్యదర్శి నరేశ్‌కుమార్, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కొటేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దర్శకేంద్రుడు కే.రాఘవేంద్రరావు

కొటేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జీవితానుభవాలను కవిత్వంగా మలిచి, ఆ కవిత్వాన్ని మంచి మాటలుగా మార్చి, అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో కొటేషన్లుగా మార్చి క్యాలెండర్ రూపొందించడం స్ఫూర్తిదాయకమని ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్రరావు అన్నారు. కొటేషన్‌లను చదువుకోవడానికి వీలుగా కవి కొత్త శ్రీనివాస్ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జీవితమనే మహాభారతంలో కృష్ణుడు నీవే, అర్జునుడు నీవే, జీవన పోరాటంలో యోధుడివి నువ్వే, సారథి నువ్వే, గెలిచి నిలవడానికి వ్యూహం నీదే, ఆయుధం నీదే" అనే కొటేషన్ ఎంతో ప్రేరణాత్మకంగా ఉందని అన్నారు. శ్రీనివాస్ కొటేషన్‌లు ఎంతో ప్రేరణను ఇస్తాయని, వీటితో జీవితాన్ని ఆదర్శవంతంగా రూపొందించుకోవచ్చన్నారు. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం ఈ క్యాలెండర్ ముఖ్య ఉద్దేశమని రచయిత కొత్త శ్రీనివాస్ తెలిపారు.

సీసీ రోడ్డు, డ్రైన్ పనుల పరిశీలన

అల్లాపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు, స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను కార్పొరేటర్ సబీహా బేగం శనివారం పరిశీలించారు. రూ.55 లక్షలతో చేపట్టిన ఈ పనులతో పద్మావతినగర్, మెహరాజ్ నగర్, అజీజ్ నగర్లతో పాటు బోరబండ డివిజన్‌లోని సైట్‌త్రీ కాలనీల వాసులకు కూడా వానాకాలం వరద తిప్పలు తప్పనున్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహ్మద్ మోయిజ్, మహ్మద్ చున్ను, జావెద్, మతీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆల్‌ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

షాపూర్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సూరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం వెల్ విషర్స్ ఫండేషన్ స్థాపకుడు మురళీ సంస్థ ప్రతినిధులతో కలిసి 10వ తరగతి విద్యార్థులకు 105 ఆల్‌ఇన్ వన్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో సుమంత్, ప్రదీప్, సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు కులకర్ణ ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు రామారావు, దుర్గయ్య, దస్తయ్య, రామచంద్, నాగేంద్రమ్మ, జ్యోతి, శశికళ పాల్గొన్నారు.

'ఆరు గ్యారెంటీలు అర్హులకు ఇవ్వాలి'

బాలానగర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలు అర్హులైన వారికి అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. మూసాపేటకు చెందిన చునూ పాష తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపిశెట్టి రఘు, తూమువేణు, సతీష్‌గౌడ్, తూము సంతోష్, స్వరూప, ఎల్లేశ్, లక్ష్మయ్య, నయీమ్, సచిన్, షకీల్, వెంకటేశ్‌యాదవ్, ఇర్ఫాన్, అమీర్, ఖాజపాష, మోయిన్, తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఫ్లైఓవర్ల పెండింగ్ : కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ గచ్చిబౌలి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్లక్ష్యం, సహకార లోపంతోనే అంబర్‌పేట్, ఉప్పల్ ఫ్లై ఓవర్ల పనులు పెండింగ్‌లో పడ్డాయని కేంద్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బేగంపేటలోని హరిత ప్లాజా హోటల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమితి(దిశా) సమావేశం శనివారం నిర్వహించారు. నగరంలో కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగర ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కేంద్రప్రభుత్వం రూ.715 కోట్లతో అభివృద్ధి చేస్తున్నప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణలో సహకారం అందించడంలేదని ఆరోపించారు. నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ టర్మినల్స్‌కు అదనంగా చర్లపల్లి దగ్గర మరో టర్మినల్ కడుతున్నామని, కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద రైల్వేస్టేషన్ నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రోస్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సురేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించేందుకు సిద్ధం

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెషన్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక స్థానాలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, నాయకులు వీరేంద్రగౌడ్, సునీతారెడ్డి పాల్గొన్నారు.



ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్

'నివాసాల మధ్య సెల్ టవర్ వద్దు'

ఓల్డుబోయినపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నివాసిత ప్రాంతాల్లో సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేయవద్దని నిబంధనలు చెబుతున్నా కొంతమంది ఇంటి యజమానులు అదనపు ఆదాయం కోసం కక్కుర్తి పడుతున్నారని అన్నారు. సెల్యూలాయిడ్ సంస్థలు ఇచ్చే డబ్బులకు ఆశపడి నిబంధనలను తుంగలో తొక్కి తమ బిల్డింగ్‌లపై సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధి అంజయ్యనగర్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ టవర్ కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నామని కొందరు స్థానికులు ఆ ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. సెల్‌ఫోన్ టవర్‌ను తొలగించాలని శనివారం సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేసిన ఇంటి యదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నర్సింహ యాదవ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణయ్య, టీపీవో సుశ్మితను రప్పించి పరిస్థితిని వారికి వివరించారు. నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ టవర్‌ను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన డీసీ కృష్ణయ్య ఇంటి యజమానికి, సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేసిన వారికి వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపడతానని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్థానికులు శాంతించడంతో పరిస్థితి సద్దు మనిగింది. కార్యక్రమంలో డివిజన్ నాయకులు నరేందర్‌గౌడ్, మక్కల నర్సింగ్‌రావు, స్థానికులు పాల్గొన్నారు.